క్లుప్తంగా

విధుల్లోకి జీపీఓలు

ధన్వాడ: మండలంలోని 7 రెవెన్యూ గ్రామాలకు గురువారం గ్రామ పరిపాలన అధికారులు (జీపీఓలు) బాధ్యతలు తీసుకున్నారు. మండలంలో మొత్తం 10 మేజర్ పంచాయతీలు ఉండగా.. 7 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. జీపీఓల చేరికతో గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

అవ్వా తాతల దీవెన



మరికల్: వంశానికి పెద్దల ఆశీర్వాదం చిన్నారులకు ఉండాలనే సంకల్పంతో గురువారం మరికల్‌లో గురువారం అవ్వాతాతల దీవెన కార్యక్రమం నిర్వహించారు. గ్రాండ్ పేరెంట్స్ డే సందర్భంగా మండల కేంద్రంలోని రేయినోబో పాఠశాలలో వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ట్రైనింగ్ ఎస్ఐ మహేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారి విద్యార్థులు వారి అవ్వాతాతలను శాలువాలతో సన్మానించి, పాదాభివందనం చేశారు. మనవళ్లు, మనవరాళ్లపై అవ్వాతాతలు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన పాఠశాల కరస్పాడెంట్ షఫియోద్దీన్‌ను ట్రైనింగ్ ఎస్ఐ అభినందించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన



కోస్గి రూరల్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందే మహిళా సంఘాల సభ్యులకు గుండుమాల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించినట్లు ప్రథమ్ సంస్థ కోఆర్డినేటర్ అంజిలయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల్లో అక్షరాస్యత శాతం పెంచడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితిగతులు పెంచేందుకు తోడ్పాటు అందుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సీసీ నర్సిములు, టాస్ కోఆర్డినేటర్ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

చెస్ బోర్డుల పంపిణీ



ధన్వాడ: పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం చెస్ నెట్‌వర్క్ టీం ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 203 చదరంగం బోర్డులతో పాటు చెస్ పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం కోఆర్డినేటర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాలమూరు ఎన్నారై ఫోరం చెస్ బోర్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా తీసుకుందన్నారు. యువ విద్యార్థులు ఫోన్లకు బానిసలై సమయాన్ని వృథా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చదరంగం ఆడుతూ మేధాశక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలమూరు ఎన్నారై ఫోరం సభ్యులు రవిరెడ్డి, సుధీర్, సంజయ్, హరిరాజ్, రాజన్న, శివారెడ్డి, మహిపాల్‌రెడ్డి, గాయత్రి, ప్రదీప్‌కుమార్, నరసింహచారి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నారాయపేట జిల్లా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా డాక్టర్ వై మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఆదిత్యగౌడ్, కోశాధికారిగా డాక్టర్ గీత విశ్వనాథ్, ఉపాధ్యక్షులు డాక్టర్ కార్తీక్ గండె, సహ కార్యదర్శి డాక్టర్ అక్షితతో పాటు కొందరిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ఆత్మకూర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం పట్టణంలో బీసీ, ఎస్సీ వసతి గృహాన్ని కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సాగునీటిని ఒడిసిపడదాం



భీమానదిలో నీటి జాడ లేని పరిస్థితి (ఫైల్)

- భీమానదిలో చెక్‌డ్యాంలు నిర్మించాలని రైతుల విజ్ఞప్తి
- నది విశాలం తక్కువ.. డెల్టా ప్రాంతాలు అనుకూలం

కృష్ణా: మండలంలోని సూకూర్‌లింగంపల్లి, కుసుమర్తి, తంగిడి గ్రామాల పక్కన ప్రవహిస్తున్న భీమానదిపై ప్రభుత్వం చెక్‌డ్యాంలు, చిన్నపాటి ఆనకట్టలు నిర్మించినట్లయితే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. దీంతో పాటు వేసవిలో సాగునీటి ఇబ్బందులు అధిగమించవచ్చంటున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించాలని ఆయా గ్రామాల రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

డెల్టా ప్రాంతాలు అనుకూలం

భీమా, కృష్ణా నదుల్లో చాలా వరకు డెల్టా ప్రాంతాలు ఉన్నాయి. ఆ డెల్టా ప్రాంతాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో పట్టా భూములుగానే నమోదై ఉన్నాయి. నదిలోని రెండు గుట్టల మధ్య ఒక పాయ తెలంగాణ వైపు, మరోటి కర్ణాటక ప్రాంతంలో ప్రవహిస్తోంది. నది కర్ణాటక ప్రాంతంలో పెద్దది గానూ.. ఇటు వైపు గుట్టల మధ్య పాయ చిన్నది గాను ఉంది. ఈ చిన్న పాయకు రెండు గుట్టల మధ్య ప్రభుత్వం చిన్నపాటి ఆనకట్ట నిర్మిస్తే నదిలో పుష్కలంగా నీరు నిల్వ ఉంచుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు అంటున్నారు. ఈ డెల్టా ప్రాంతాలు ప్రకృతి సిద్ధంగా ఎత్తుగా ఉండడం మూలంగా నదిలోని నీరు కర్ణాటక ప్రాంతంలో ఎక్కువగా ప్రవహిస్తుంది. దీని మూలంగా ఈ ప్రాంత రైతులకు వేసవి సమయంలో సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను అధిగమించుటకు కేవలం ఏకైక మార్గం చెక్ డ్యాం లేదా ఆనకట్టలు కట్టడమేనని అంటున్నారు.

తాగునీటి ఇబ్బందులు తొలగుతాయి

ఈ నదులపై ఎగువన ఉన్న కర్ణాటక ప్రభుత్వం ఎక్కడికక్కడ చిన్న చిన్న బ్రిడ్జికం బ్యారేజీలు, చెక్‌డ్యాంలు నిర్మించి అక్కడి రైతులకు సాగునీరు అందిస్తుంది. అదే తరహాలో మన ప్రాంతంలో కూడా చిన్న చిన్న చెక్‌డ్యాంలు నిర్మించడం మూలంగా ముఖ్యంగా సాగునీటికి ఉన్న ఇబ్బందులు తొలగడంతో పాటూ తాగునీటి అవసరాలకు కూడా ఉపయోగపడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలున్నాయని, ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకుంటే తమ బతుకులు మారతాయంటున్నారు.

చెక్‌డ్యాం నిర్మిస్తే..



మా ప్రాంతంలోని కృష్ణానదిలోని డెల్టా ప్రాంతాల్లో చెక్‌డ్యాంలను నిర్మిస్తే సాగునీరు అందుతుంది. ముఖ్యంగా వేసవిలో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండగా పంటలు పండించుకుంటాం. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి.

– దేవేంద్రప్ప, రైతు, కుసుమర్తి

ప్రభుత్వం చొరవ చూపాలి



కృష్ణానదిలో ప్రకృతి సిద్ధంగా ఉన్న డెల్టా ప్రాంతాల్లో నీటిని దిగువకు వెళ్లనీయకుండ నిల్వ చేసుకునేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఉపాధి హామీ పథకంలో చిన్నపాటి ఆనకట్టలు కట్టేందుకు కృషి చేయాలి.

– ఆంజనేయులు, రైతు, సూకూర్‌లింగంపల్లి

విద్యకు తొలి ప్రాధాన్యత



నారాయణపేటలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న లయన్ సభ్యులు

నారాయణపేట రూరల్: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ విద్యారంగానికి తొలి ప్రాధాన్యత అందిస్తుందని పాస్ట్ గవర్నర్ హరినారాయణ్ బట్టడ్ అన్నారు. గురువారం జిల్లాలోని 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5వేల మంది విద్యార్థులకు 19 వేల నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్‌కు విద్యార్థులే పునాది రాళ్లని, ప్రభుత్వా లు, వివిధ సంస్థలు అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. విద్య, వైద్య రంగాల్లో ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సరిత బట్టడ్, కోశాధికారి రాధాచారి, నాయకులు ఆత్మారాం, సత్యనారాయణ, సదానంద్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మక్తల్‌లో అన్నదానం

మక్తల్: శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్య అంజనేయులు ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీమతి సౌభాగ్యలక్ష్మి జన్మదినం సందర్భంగా అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మక్తల్ భీమా సెక్రటరీ అంజన్‌ప్రసాద్, ట్రెజరర్ ఆడెం సత్యనారాయణ, జోన్ చైర్మన్ జైపాల్‌రెడ్డి, శరణప్ప, అంబదాస్, కట్ట వెంకటేష్ పాల్గొన్నారు.

యూరియా సరఫరా చేయాలి

దామరగిద్ద: మండలంలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా సరఫరా చేయాలని బీకేఎస్ జిల్లా విద్యుత్ ప్రముఖ్ మహిపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, మండల అధ్యక్షుడు సుభాష్, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బాల్‌చందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన యూరియా పంపిణీని వారు పరిశీలించారు. రైతులకు సరిపడా యూరియాను అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారులు రైతులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని యూరియా సరఫరాకు మించి టోకన్లు అందజేయడం వల్ల క్యూలో నిలిచినా యూరియా లభించక కొందరు రైతులు అసంతృప్తికి గురవుతున్నారన్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

కృష్ణా: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి రైలు ఢీకొని వ్యక్తికి కాలు విరిగిన ఘటన చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు.. రాయచూర్ పట్టణంలోని ఆశాపూర్‌కు చెందిన లక్ష్మణ్ (59) అక్కడ విద్యాశాఖలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. కాగా కృష్ణాలో కల్లు తాగడానికి వచ్చి, తిరుగు ప్రయాణంలో బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే సమయంలో ప్రమాదం చోటు చేసుకొని కాలు విరిగింది. గమనించిన రైల్వే కానిస్టేబుల్ మునిస్వామి వెంటనే క్షతగాత్రుడిని రాయచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఊట్కూరులో ఉచిత వైద్య శిబిరం



ఊట్కూరులో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న శ్రీహరి సేవా సమితి సభ్యులు

ఊట్కూరు: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవనంలో గురువారం ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150 మందికి డాక్టర్ పృథ్వీ ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ఆజమ్మ, సభ్యులు నర్సింహులు, నారాయణ, హనుమంతు, శంకర్, భరత్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

కంటి అద్దాల పంపిణీ

వాకిటి శ్రీహరి సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేపట్టారు. 4 రోజుల క్రితం లయన్స్ రాంరెడ్డి కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో 25 మందికి కంటి శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్స చేసుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు రవికుమార్, మహేష్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, లింగం, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



మక్తల్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మక్తల్ సీఐ రాంలాల్ అన్నారు. గురువారం మక్తల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో చాలాకాలంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఈ నెల 13న జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రిమినల్, భూ తగాదాలు, సివిల్, చిట్‌ఫండ్, చెక్‌బౌన్స్, వైవాహిక, కేసులు తగాదాలు, అన్ని రకాలు ట్రాఫిక్ కేసులను ఇరువర్గాల వారు పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ శనగ విత్తనాలు అందించాలి



జాన్ సుధాకర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: శనగ విత్తనాలు అవసరమున్న ప్రతి రైతుకు ప్రభుత్వం అందించాలని ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యవసాయ అధికారి జాన్‌సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణపేట, దామరగిద్ద మండలంలో వ్యవసాయానికి సంబంధించిన ఏ సమాచారం అయినా ప్రజలకు చేర్చడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. విత్తనాలు, యూరియా తదితర వ్యవసాయానికి సంబంధించిన అంశాలు రాజకీయ నాయకులకు తప్పా రైతులకు తెలియడమే లేదన్నారు. కార్యక్రమంలో దామగిద్ద మండల అధ్యక్షుడు తాయప్ప, మండల నాయకులు వెంకటేష్, మధు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం



అమరచింత: అనారోగ్యంతో నందిమళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి(40) గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. చంద్రశేఖర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కేశం నాగరాజ్‌గౌడ్, నాయకులు ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మార్కెట్‌చైర్మన్ రహమతుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

భవిష్యత్ అంతా రోబోటిక్స్‌దే

ధరూరు: రానున్న రోజుల్లో రోబోటిక్స్ రంగం దూసుకెళ్తుందని హైదరాబాద్‌కు చెందిన సోహం అకాడమీ ప్రతినిధి అరవింద్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. టెక్నాలజీ పరంగా ఏటేటా ముందుకు సాగుతున్న తరుణంలో రానున్న రోజుల్లో టెక్నికల్ రంగమే ముందంజలో ఉంటుందన్నారు. టెక్నాలజీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కారక్యక్రమంలో జీహెచ్ఎం ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్, రాధారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరవింద్

ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత



కోస్గిలో పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన మొరం టిప్పర్లతో ఎస్ఐ బాల్‌రాజ్

మద్దూరు: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా కోయిలకొండ వాగు నుంచి టిప్పర్లతో తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి గురువా రం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్ఐ విజ య్‌కుమార్ తెలిపారు. కోయిలకొండ మండలానికి చెందిన పాశం బుచ్చప్ప, హన్వాడకు చెందిన కావ లి వెంకటయ్యలకు చెందిన టిప్పర్లు మద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోస్గి రోడ్డుపై పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. టిప్పర్లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్లు పే ర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

కోస్గి రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌తో పాటు రెండు మొరం టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేసిన ఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, కోస్గి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టణ శివారులో రెండు మొరం టిప్పర్లను పట్టుకొని డ్రైవర్లు వంశీ, శ్రావణ్, ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ మధురెడ్డిపై కేసు నమోదు చేపట్టి వాహనాలను స్టేషన్‌కుకు తరలించామని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నర్వ: ఒకే కాంప్లెక్స్ పరిధిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ సేవలందించడంతో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికయ్యారు. మండలంలోని పెద్ద కడ్మూర్ కాంప్లెక్స్ పరిధిలో గురువారం సమావేశం నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన కాంప్లెక్స్ జీహెచ్ఎం భాగ్యలక్ష్మి, కొత్తపల్లి హెచ్ఎం రాఘవరెడ్డిని ఉపాధ్యాయులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఉపాధ్యాయులకు బోధనా పద్ధతులపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు జనార్దన్, రాజు, మణెమ్మ, బాల్సేడ్, ఉపాధ్యాయులు నవీన్, వెంకటేష్, శ్రీలేఖ, అనిల్‌కుమార్, రమేష్‌గౌడ్, మాధవి, ముబీన్, సీఆర్పీ నర్సిములు పాల్గొన్నారు.

ఎంపీ అరుణ చిత్రపటానికి పాలాభిషేకం



స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కృష్ణా: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గురువారం అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఎంపీ డీకే అరుణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ మాట్లాడుతూ కృష్ణా రైల్వేస్టేషన్‌లో మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపేందుకు కేంద్ర రైల్వేశాఖ నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఇందుకు కృషి చేసిన ఎంపీ డీకే అరుణకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం నడుస్తున్న కాచిగూడ, రాయచూర్ రైళ్ల సమయం మార్చాలని కోరుతూ స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు బల్‌రామ్‌రెడ్డి, కర్నె స్వామి, మండల అధ్యక్షుడు నర్సప్ప, మాజీ సర్పంచ్ మహాదేవ్, నాయకులు వెంకటేష్, కొంకల్ వెంకటేష్, జయానంద్‌రెడ్డి, అంజప్పగౌడ, తిమ్మప్ప, శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం



మాట్లాడుతున్న ఆంజనేయులు

నారాయణపేట టౌన్: భూ నిర్వాసితులకు న్యాయపరమైన పరిహారం అందే వరకు పోరాటం ఆగదని భూ నిర్వాసితుల సంఘం నాయకుడు కుంటిపాప ఆంజనేయులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక మున్సిపల్ పార్కు వద్ద జరుగుతున్న రిలే దీక్షలో పాల్గొని ఆయన మాట్లాడుతూ.. రిలే దీక్షలు ప్రారంభించి 59 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పష్టమైనా ప్రకటన చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోతున్న భూ నిర్వసితులకు ఎకరానికి రూ.35 లక్షల చొప్పున పరిహారం అందించి, ఇంటికో ఉద్యోగంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నుంచి బలవంతపు భూ సేకరణకు ప్రభుత్వం సిద్ధమైతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు మచ్చేందర్, శ్రీనివాస్, నర్సిములు పాల్గొన్నారు.

ఇంటర్ దశే విద్యార్థులకు ముఖ్యం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ రాంకోటి, సీఐ రాజేందర్‌రెడ్డి

మరికల్: జీవితంలో బాగుపడాలన్నా.. చెడిపోవాలన్న ఇంటర్మీడియట్ దశే కీలకంగా ఉంటుందని తహసీల్దార్ రాంకోటి, సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. మరికల్ మణికంఠ జూనియర్ కళాశాలలో గురువారం మొదటి సంవత్సర విద్యార్థులకు ఆహ్వాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల ఇంటర్మీడియట్‌లో తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదివిన వారే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. ఈ దశలో సెల్‌ఫోన్లు, అమ్మాయిల వెంటపడ్డ వారు ఎటూ పనికి రాకుండా పోతారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడాలని సూచించారు. అనంతరం గతేడాది ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, ఆనంద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మదనాపురం: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మండ్ల రాజు మాట్లాడుతూ.. రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించు కుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రతినెలా వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, అమలు జరగకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గుర్తింపుకార్డులు, యూనిఫాం వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. జీవో నెం.51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రాములు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు చిరంజీవి, గ్రామ పంచాయతీ సంఘం నాయకులు ఖాదర్, అశోక్ పాల్గొన్నారు.

నీటివృథా.. అరికట్టేది ఎలా..?



దశమికట్ట సమీపంలో మరికల్-ఆత్మకూర్ ప్రధాన రహదారిపై పారుతున్న భగీరథ నీరు

అమరచింత: ప్రతిరోజూ పట్టణంలోని ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి తాగునీరు వృథాగా పారుతున్న సంబంధిత అధికారులు నీటివృథాను అరికట్టలేని స్థితిలో ఉన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు ఒక పక్క సత్వర చర్యలు తీసుకుని మరమ్మతులు చేపడుతుంటే ఇక్కడ మాత్రం రహదారులపై వృథాగా పారుతున్న నీటిని అరికట్టలేక పోతున్నారు. పట్టణంలోని దశమికట్ట సమీపంలోని మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులతో పాటు హైస్కూల్ ఆవరణలో ఉన్న ట్యాంకులు నీటితో నిండుకుని ఓవర్‌ఫ్లో ద్వారా తాగునీరు రహదారులపై పారుతున్నది. దీంతో నీరు ప్రతిరోజూ పారుతుండటంతో బీటీ దెబ్బతిని గుంతలమయంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటివృథాను అరికట్టాలని కోరుతున్నారు.